# క్రియ పిల్లల పండుగ - 2018

# రాష్ట్ర స్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు

ఐన్ స్టీన్ శాస్త్రవేత్త అని అందరికీ తెలుసు. కానీ అతనికి వయోలిన్ వాయించడం చాలా ఇష్టమని, అతనొక గొప్ప సంగీత ప్రేమికుడని కొద్దిమందికే తెలుసు. ఐన్ స్టీన్ ప్రతిపాదించిన ప్రసిద్ధ "సాపేక్ష సిద్ధాంతం" (theory of relativity) ప్రణాళికాబద్దంగా చేసిన ఆలోచన కాదు. అది అతనికి సహజంగా, స్పురించిన (intuition) సత్యం. సైన్సుకు సంబంధించిన మూల సూత్రాలపై లోతయిన అవగాహన లేకుండా ఇది సాధ్యం అయ్యేది కాదు. కానీ ఆ క్షణంలో ఆ సత్యం తట్టడానికి వెనుక ఉన్న బలమయిన శక్తి సంగీతమని చాలా సార్లు చెప్పాడు కూడా. సైన్స్, లేదా ఆర్ట్ రెండిటిలో ఏదో ఒకటే ఎంచుకోవడం వలన ఆ ఫీల్డ్ లో ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చు అన్నది ఒక అపోహ మాత్రమే అని ఐన్ స్టీన్ జీవితాన్ని గమనిస్తే భోదపడుతుంది. మనిషి మెదడులో ఎడమ భాగం లాజికల్ గా ఆలోచించడానికి, కుడి భాగం కళాత్మక భావనలకూ సంబంధించినవి. ఒక భాగాన్ని మాత్రమే ఎక్కువ ఉపయోగించి, ఆ ఒక్క భాగమే అభివృద్ధి చెందితే సమతుల్యం దెబ్బతినే పరిస్తితి వస్తుంది. కాబట్టి అలా జరగకుండా ఉండటానికి ఒక స్థాయికి చేరుకున్న తరువాత మెదడు ఎదుగుదలను నిలుపుదల చేసుకుంటుంది. రెండవ అర్ద భాగాన్ని కూడా సమానంగా ఉపయోగించగలిగితేనే, మళ్ళీ మొదటి భాగం ఇంకా అభివృద్ధి చెంది పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం జరుగుతుంది. కళకో , లేక సైన్స్ కో ఏదో ఒక దానికే పరిమితమయిపోతే ఒక స్టేజ్ తరువాత మెదడు అబివృద్ధి చెందడం శాశ్వతంగా ఆగిపోతుంది.

ప్రస్తుతం అందరూ మార్కులు, ర్యాంకులు మీదే దృష్టి కేంద్రీకరించడం వలన సమాజం మొత్తంలో ఒక విధమయిన మానసిక అసమతుల్యత, అసంతృప్తి కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో కళ మనిషి జీవితానికి వెలుగును తీసుకొస్తుంది. అందులోనూ ఆ బీజం చిన్న పిల్లలలోనే పడటం మంచిది అన్న ముఖ్య ఉద్దేశంతో క్రియ సంస్థ వివిధ అంశాలలలో సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నది.

**లఘు నాటికలు :** నటించడం కోసం రకరకాల వ్యక్తుల ప్రవర్తనను, ఎమోషన్స్ ను, బాడీ లాంగ్వేజ్ ను గమనించడం వలన, అలా గమనించిన కొత్త వ్యక్తిత్వాన్ని తనలో నింపుకోవడానికి, తనలోని వ్యక్తిత్వాన్ని కొద్ది సమయం పక్కన పెట్టడం అనే ప్రక్రియ వలన "నా భాష, నా యాస, నా హావ భావాలే సరైనవి" అన్న మానసిక బిగింపు ఒకటి తనలో ఉందన్న విషయం భోదపడుతుంది. మనసు విశాలమై, అన్ని రకాల వైరుధ్యాలను స్వీకరించే మనస్తత్వం అభివృద్ధి చెందుతుంది. మిగిలిన నటులు చేసిన తప్పుల వలన అయితేనో, స్టేజ్ పై అనుకోని సమస్యలేమయినా వస్తేనో అప్పటికప్పుడు ఏం చెయ్యాలో అలవడుతుంది. ఇవన్నీ స్టూడెంట్ వ్యక్తిగత జీవితంలో మరియు పెద్దయ్యాక చేసే వృత్తిలోనూ చాలా ఉపయోగపడుతాయి. ఇలా పెరిగిన పిల్లలు మంచి నాయకులు కాగలరు.

**నృత్యం :** పాటలోని భావంలో, సంగీతంలో మునిగిపోయి తనదయిన ఆనందలోకంలో నర్తిస్తుంటే, అది చేసే వారిని, చూసే వారిని కూడా పరవశులను చేస్తుంది. స్టూడెంట్ ఒక నృత్యరూపకంలో నిమగ్నం అవగలిగితే, అది చదువులోనూ, జీవితాన్ని ఆస్వాదించడంలో కూడా జరుగుతుంది. ఆ సంగీతంలో వచ్చే సూక్ష్మమయిన మార్పులకు అనుగుణంగా శరీరం స్పందించడం వలన బాడీ - మైండ్ కో ఆర్డినేషన్ అద్భుతంగా ఉంటుంది. క్లాసికల్ డాన్స్ లో వాడే రకరకాల ముద్రలు స్టూడెంట్ లో స్టెబిలిటీని పెంచుతాయి. డాన్స్ ఇష్టపడి చేయగల మంచి వ్యాయామం కూడా. జానపద నృత్యాలు గ్రామీణ జీవనాన్ని, అక్కడి ప్రజల ఆలోచనా విధానాన్ని, వారి జీవితంలోని సింప్లిసిటీని, వారి ఆనందాన్ని, కష్టాలను మన కళ్ళ ముందు ఉంచుతాయి.

**పోస్టర్ ప్రజంటేషన్** : విద్యార్థులు వారు తెలుసుకున్న లేదా పరిశోధన చేసిన విషయానికి సంబంధించిన చిత్రాలను, సేకరించిన సమాచారాన్ని ఒక పెద్ద చార్టుపై క్రమబద్ధంగా పేర్చి ఒక ప్రజంటేషన్ గా తయారుచేసి, ఆడియన్స్ కి అర్థం అయ్యేలా వివరించడం. కదలకుండా నిలబడి ఉపన్యాసం ఇవ్వడం కంటే ఆడియెన్స్ తో ఇంటరాక్ట్ అవుతూ ఇచ్చే పోస్టర్ ప్రజంటేషన్ కేవలం చెప్పుకు పోవడమే కాక, లోతయిన విషయావగాహనకు అవకాశం కల్పిస్తుంది. వారు భవిష్యత్తులో ఉద్యోగ సమయాల్లో చేసే పవర్ పాయింట్ ప్రజంటేషన్స్ కి మొదటి అడుగు అవుతుంది.

**సైన్స్ ప్రయోగాలు :** ఒక సిద్ధాంతాన్ని ఎన్నో సార్లు చదవడం వలన రాని అవగాహన ఒక్కసారి ప్రయోగం చేయడం వలన వస్తుంది. ప్రయోగాల వలన ప్రాక్టికల్ ప్రొబ్లెంస్ అర్థమవుతాయి. ఈ అనుభవాలు భవిష్యత్తులో సొంతంగా ఏదయినా చేసినప్పుడు ఉపయోగపడతాయి. ప్రయోగంలో కొన్ని మార్పులు చేస్తే ఫలితం ఏమవుతుంది అన్న ఆలోచన, కొత్త ప్రయోగాలకు, పరిశోధనలకు దారి తీస్తుంది. పుస్తకాలతో ఆగిపోయిన వారు ఎప్పటికీ శాస్త్ర వేత్తలు కాలేరు.

**తెలుగులో మాట్లాడడం :** వాడుక భాషలోకి ఆంగ్లం అతిగా చొరబడటం వలన పూర్తిగా తెలుగులో మాట్లాడటం అనేది సాధ్యం కాని విషయంలా అయిపోయింది. ఒక విషయాన్ని పూర్తిగా తెలుగులోనే మాట్లాడాలి అన్న నియమం వలన విధ్యార్థి పదసంపద పెరగడమే కాకుండా, మాటలు పరద్యానంగా పలికే స్థితి నుండి సంపూర్ణ ఎరుక లోంచి వస్తాయి. భావోద్వేగాలు కూడా పూర్తి నియంత్రణలో ఉంటాయి.

**నాటకీకరణ :** విద్యార్థులు తమకు ఒక గంట ముందు ఇచ్చిన అంశం నుండి కథ లేదా ఒక సంఘటన అల్లుకొని, ఏ మేకప్పు అవసరం లేకుండా కేవలం నటనాకౌశలంతో నాటికలా ప్రదర్శించడం. నాటకం వలె కాకుండా కొద్ది సమయంలో టాపిక్ ని ఒక స్టోరీ లైన్ గా మలచుకొని, దానికి అనుగుణంగా పాత్రలను సృష్టించి, ఆ మొత్తాన్ని బాడీ లాంగ్వేజ్ లోకి, హావభావాలలోకి మార్చే సృజనాత్మక ప్రక్రియ కావడం వలన విద్యార్థులలో సమయస్ఫూర్తి అలవడుతుంది. భవిష్యత్తులో వారు ఏ పదవిని చేపట్టినా, తమ భావాలను చక్కగా ఒక కథలా, మనసుకు హత్తుకునేలా చెప్పే నైపుణ్యం సంపాదిస్తారు. అంత తక్కువ సమయంలో నలుగురితో సమన్వయం రావడం అనేది జీవితంలో, సంఘజీవనంలో తోటి సభ్యులతో సమన్వయానికి ఉపయోగపడుతుంది.

**క్విజ్ :** విద్యార్ధుల జనరల్ ఏవేర్నెస్, రీజనింగ్ పెరిగడం, తెలిసిన విషయాలను కొత్త ప్రశ్నలకు అన్వయించే చాకచక్యం అలవడుతుంది. నేర్చుకున్న అంశాన్ని మరల జ్ఞప్తికి తెచ్చుకునే ప్రక్రియ. ఎక్కువకాలం విషయం మెదడులో నాటుకుని జ్ఞాపకశక్తిని ఎన్నోరెట్లు పెంచుతుంది. గ్రూపులోని, ఇతర గ్రూపు వ్యక్తుల మధ్య ఆరోగ్యకరమైన చర్చలు జరపే అవకాశం కలిగి చిన్న వయసునుండే టీమ్ వర్క్ కి అలవాటు పడడం, తద్వారా వ్యక్తులమధ్య సత్సంబంధాలు నెలకొని మెరుగైన సమాజానికి బాట ఏర్పడుతుంది. రోజువారీ తరగతి విద్యకు భిన్నంగా ఉండడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో, ఇది పోటీతత్వం పెంచి వారి ఉన్నతికి ఉపయోగపడుతుంది

**డిబేట్ :** తను సమర్ధిస్తున్నవిషయాన్ని వ్యతిరేకిస్తూ, అనుకోకుండా వచ్చిన కొత్త ప్రశ్నలను ఎదుర్కొని అప్పటికప్పుడు సరియయిన రీతిలో సమాధానం చెప్పడానికి సమయస్ఫూర్తి, లాజికల్ గా మాట్లాడటం, చాలా విషయాలపై అవగాహన ఉండటం ఎంతో అవసరం అవుతాయి. ఇటువంటి డిబేట్ లో వాదనల వలన అంతకు ముందు ఎవరూ అనుకోని కొత్త అవగాహన, పరిష్కారాలు కూడా స్ఫురిస్తాయి.
విదార్ధులు ఆత్మ స్థైర్యం పెరుగుతుంది. అప్పటి వరకూ తమలో ఉన్న కొన్ని తప్పు అభిప్రాయాలను తొలగించుకొనే అవకాశం ఉంటుంది. జ్ఞానం శుద్ధమవుతుంది.

**లఘు చిత్ర సమీక్ష (షార్ట్ ఫిలిం రివ్యూ) :** అక్షర జ్ఞానంలేనివారు కూడా, చదువుకున్న వారితో సమానంగా కనెక్ట్ అయ్యే మీడియం సినిమా. దానిని అర్ధం చేసుకొని సహేతుకంగా విమర్శించగలిగే క్రిటిక్స్, సునిశితంగా ఆలోచించ గలిగిన ప్రేక్షకులు ఎక్కువ సంఖ్యలో లేనంత కాలం మంచి సినిమాలు రావు. బెంగాల్ సినిమాలకు ఎక్కువ అవార్డులు రావడానికి కారణం, ఇటువంటి విమర్శనాత్మక దృష్టి ఎక్కువ మందిలో ఉండటం, అటువంటి సినిమాలను అక్కడి ప్రజలు ఆదరించడం. స్టూడెంట్స్ ఫిల్మ్ కి సంబందించిన కథ, స్క్రీన్ ప్లే, ఫోటోగ్రఫి, ఎడిటింగ్ వంటి అన్ని ప్రక్రియలను సరిగా అర్ధం చేసుకొనే స్థాయి వస్తే, వాళ్ళ భావాలను వ్యక్తం చేయడానికి అతి తక్కువ ఖర్చుతో షార్ట్ ఫిల్మ్ తీసే సామర్ధ్యం డెవెలప్ అవుతుంది.

**కథారచన :** వ్యాసం ఒక విషయాన్ని దూరం నుండి చూపిస్తే, అదే విషయాన్ని కథ ఆ పరిస్థితుల మధ్య నిలబెట్టి చెబుతుంది. ఒకొక్కసారి పాత్రలో నిన్ను లీనం చేసి ఆ పాత్ర కళ్ళల్లోంచి వాస్తవాన్ని చూసేలా చేస్తుంది. మనిషి ఎదుర్కొన్న పరిస్తితులు, అనుభవించిన మానసిక సంఘర్షణను సంఘటనల రూపంలో వివరించి, చదివే వారిని అందులో మమేకం చేయగలుగుతుంది. విద్యార్ధులకు కథలు రాయడం అనే అలవాటు ఏర్పడితే తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని సూక్ష్మంగా గమనించడం మొదలు పెడతారు. పరిశీలనా శక్తి పెరిగి, ఆలోచనా స్థాయి విశాలం అవుతుంది. ఇతరుల ప్రవర్తనను అందుకు కారణమయిన పరిస్థితులను లోతుగా అర్ధం చేసుకోవడం వలన చుట్టూ ఉన్న మనుషులను, సమాజాన్ని ప్రేమించగలుగుతారు.

**మ్యాప్ :** మ్యాప్ పాయింటింగ్ వల్ల విద్యార్థులకు ప్రపంచంలోని వివిధ ఖండాలు, దేశాలు, దేశాలలోని ముఖ్యమైన నగరాల పేర్లు పరిచయం అవ్వడమే కాక, ఆయా దేశాల భౌగోళిక, సాంఘిక, రాజకీయ అంశాలకు

సంబంధించిన పరిజ్ఞానం వస్తుంది. ఒకప్రాంతంలోని అడవులు, నదులు, సముద్రాల వంటి సహజ వనరుల ఉనికిని తెలియజేస్తుంది. ఒక భౌగోళిక ప్రాంతంలోని వివిధ స్థలాలు ఏదిక్కుగా, ఎంత దూరంలో ఉన్నాయో తెలుసుకోవడం సులభం చేస్తూ విద్యార్థుల గణిత, గ్రాఫ్ జ్ఞానాన్ని పెంచడం వారి ప్రాబ్లమ్ సాల్వింగ్ మరియు రీజనింగ్ నైపుణ్యాలను పెంచుతుంది. పిల్లలకు తాము ఒక పెద్ద ప్రపంచంలో నివసిస్తున్నామన్న స్పృహ వారి ఆలోచనా ధృక్పధాన్ని విశాల పరచే విధంగా తోడ్పడుతుంది. రేపు వారు పెద్దయ్యాక సుదూర ప్రాంతాలకు యాత్రకు వెళ్ళేటప్పుడు ఈ జ్ఞానం ఉపయోగపడుతుంది.

అంతర్జాలంలో అన్వేషణ : విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు ఇచ్చి, వాటికి సమాధానాల్ని, స్మార్ట్ ఫోన్ సహాయంతో అంతర్జాలంలో వెతికి రాయమనడం. ఇప్పుడు ప్రతీ ఇంటిలో అందుబాటులో ఉన్న స్మార్ట్ ఫోన్ వలన పిల్లలు పాడయిపోతున్నారని పేరెంట్స్ కంప్లయింట్. అలాగని వద్దని చెబితే, చాటుగా చూస్తారు తప్ప మానరు. అలాకాక ఇంటర్నెట్ ద్వారా సైన్స్ సంగతులు, చారిత్రక వాస్తవాలూ, రాజ్యాంగంలోని నియమ-నిబంధనలు, పాఠ్యపుస్తకాలలోని పదాలకు సంబంధించిన వస్తువుల, జీవుల ఫోటోలను ఎలా వెతికి తెలుసుకోవచ్చొ చెప్పడం వలన వారిని సక్రమమైన, మరియు వారిని అభిరుచికి తగిన మార్గంలో పెట్టినవారం అవుతాం. అటువంటి కల్చర్ ని స్థూడెంట్స్ అందరికీ అలవాటు చేయడానికి ఈ పోటీ ఉపయోగపడుతుంది.

**కథా విశ్లేషణ :** కథపై అవగాహన తెచ్చుకోవడం అంటే పదాలను మనసులో దృశ్యాలుగా మలచుకోవడం అలవాటు అవుతుంది. కథలోని బలాలను, అసంబద్ధతను తెలుసుకొనే ప్రక్రియలో తక్కువ సమయంలో, నిశితంగా పరిశీలించడం అలవాటు అవుతుంది. రకరకాల శైలులను అర్థం చేసుకోవడం వలన ఏ విధంగా చెబితే కథ హృద్యంగా ఉంటుందో చెప్పగలిగే స్థాయి వస్తుంది. మంచి విమర్శకులు తయారయితే చదివేవారి మెప్పుకోసం రాసే కథలు లేదా తనకు ఏమనిపిస్తే అలా రాసే కథలు తగ్గి వాస్తవికత గల కథలు పెరుగుతాయి.

**పాటలు పాడటం :** రకరకాల శృతులలో పదాలను పలకడం, పదాలను నొక్కి పలకడంలోని చిన్న చిన్న మార్పులను గమనించడం వలన సూక్ష్మమయిన వినికిడి శక్తి అభివృద్ధి చెందుతుంది. కొన్ని రాగాలు, గమకాలలో మమేకం అయిపోవడం వలన గాయకుడు, వినే శ్రోత చాలా ఆనందం పొందుతారు. మామూలు మాటల కంటే పాట యొక్క ఇంపాక్ట్ ఎక్కువ ఉంటుంది. మనుషులను, మనసులను కదిలించగలుగుతుంది. సాధారణ మాటలను యధాతదంగా ఎక్కువ కాలం పాటు గుర్తుంచుకోవడం చాలా కష్టం. కానీ రాగ యుక్తంగా మలచబడిన పాట ఎప్పటికీ మార్పు రాకుండా యధాతధంగా గుర్తుకు వస్తుంది.

**విచిత్ర వేషధారణ** : విచిత్ర వేషధారణ పోటీలద్వారా చిన్నారులకు వివిధ రకాల వేషాలు, ఆహార్యంలోని మార్పులు పరిచయమవ్వడమేకాక, పిల్లల పరిశీలనా దృష్టిని మెరుగు పరచి వారిని ఊహాత్మకంగా ఆలోచింపజేస్తుంది. తమ పాఠాల్లోని కారెక్టర్ని ప్రదర్శించడం ద్వారా పిల్లలు తమసొంతగా పరిశోధన చెయ్యడానికి అవకాశం కలుగుతుంది. తమకు ఇష్టమైన వేషధారణ పిల్లల్లో హాస్యపటిమను వెలికి తీసి, వారికి

ఆనందాన్నీ, మానసికమైన ఆహ్లాదాన్నీ కలుగజేస్తుంది అలంకరణను ఆనందించే పసి మనసులకు అవసరమైన మానసిక తృప్తిని  ఇస్తుంది.

**వాద్యసంగీతం** : కొంత కాలం సాధన ద్వారా ఒక వాయిద్యం యొక్క సాంకేతిక జ్ఞానాన్నంతా మనసులోకి ఇంకించుకొని, మనలో పొంగే ఆనందాన్నీ, దుఃఖాన్నీ, వేరే ఏదయినా భావోద్వేగాన్ని ఆ వాద్యపరికరం నుండి వచ్చే లయబద్ధమయిన ధ్వనులతో వ్యక్తం చేయడమే వాద్యసంగీతం. ఈ సాధనా సమయంలో ఒకేసారి మెదడులోని చూపు, వినికిడి, స్పర్శ , కదలికలను నియంత్రించే  అన్ని భాగాలు పనిచేయాలి. కేవలం పనిచేయడమే కాదు, ఒకదానితో ఒకటి సమన్వయం చేసుకుంటూ పనిచేయడం మూలానా ఇది మెదడుకు పూర్తి స్థాయి వ్యాయామం. అందువలనే సంగీత పరికరంతో సాధన చేసే విద్యార్థులకు జ్ఞాపక శక్తి, గణితంలో నైపుణ్యం, లాజికల్ థింకింగ్ వంటికి బాగా మెరుగుపడతాయి. మిగిలిన కళలు కూడా మెదడు ఎదుగుదలలో ఉపయోగపడినా ఈ స్థాయిలో మాత్రం కాదు.

**కథ చెప్పడం** : శ్రోతలను ఆకట్టుకొనేలా కథ చెప్పగలగడం వలన వినే ప్రేక్షకుల అవగాహనకు అనుగుణంగా పలకడం, హావభావాల మీద మంచి పట్టు వస్తుంది. బాగా కథ చెప్పగలిగిన వాళ్ళు, వినే వారి మనసులో దృశ్యాలను చిత్రీకరిస్తారు. సినిమా అందరికీ ఒకేలా కనిపిస్తే కథ మాత్రం మనిషి మనిషికి ప్రత్యేకంగా కనిపిస్తుంది. వినేవారి విజువలైజేషన్ స్కిల్ ని పెంచుతుంది. కథ వింటున్న శ్రోతల స్పందనకు అనుగుణంగా అప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ ఆసక్తికరంగా మాట్లాడటం అలవాటు అవుతుంది.

**ప్రాజెక్ట్ పని** : ఏదయినా ఒక సిద్ధాంతాన్ని వివరించడానికి సంబంధించినది కానీ, నిజ జీవితంలో ఎదురవుతున్న సమస్యలను ఎదుర్కోవడానికి గానీ, లేదా ఇంకాస్త సులువుగా పనులు చేయడానికి గానీ స్టూడెంట్స్ ప్రాజెక్ట్స్ చేస్తారు. ఇందుకోసం వాళ్ళే స్వయంగా సర్వే చేసుకొని, వస్తువులను సమకూర్చుకొని, భౌతికంగా ఒక ప్రాజెక్ట్ చేయడం వలన చదువు అనేది మాటలను దాటి క్రియాత్మకం అవుతుంది. భవిష్యత్తులో మంచి పారిశ్రామికవేత్తలుగా తయారు కావడంలో ఇది ముఖ్యపాత్ర వహిస్తుంది. ఇదే నిజమయిన విద్య.

**చిత్రలేఖనం** : ఫోటోగ్రఫీ ఇంత డెవెలప్ అయ్యాక కూడా చిత్రలేఖనం స్థాయి ఏ మాత్రం తగ్గకుండా ఉండటానికిగల కారణం ఇప్పటి వరకూ ప్రపంచం చూడని విషయాన్ని కూడా చిత్రకారుడు తన కుంచెతో చిత్రీకరించగలడు. చిత్రలేఖనం లో భావ వ్యక్తీకరణకు హద్దులు లేవు. వందల కొలదీ  పదాలు చెప్పే భావాన్ని ఒక చిత్రంతో వ్యక్తం చేయవచ్చు. ఈ కళ అర్థం చేసుకోవడానికి  భాషతో సంబంధంలేదు సరికాదా కనీసం చదువుకొని ఉండాల్సిన అవసరం కూడా లేదు. చిత్రలేఖనం విద్యార్థులు సాధన చేయడం వలన  మనుషుల, వస్తువుల, జంతువుల పై పడిన కాంతి ఎటువంటి నీడలను ఏర్పరుస్తుంది, ఏ విధమయిన రంగులను వెదజల్లుతుంది వంటివి పరిశీంచడం మొదలయితే చాలా సునిసిత  దృష్టి అలవడుతుంది. చూసే వారికి వేసేవారికీ బోలెడంత ఆనందాన్ని ఇస్తుంది.

**దస్తూరి :** చక్కని చేతిరాత అంటే పుస్తకాలలో ముద్రించబడిన అక్షరాల వలే మక్కీకి మక్కీ గుండ్రంగా అందంగా రాయడమని కాదు. దస్తూరి ఒక వ్యక్తిగత ప్రకటన. తనదైన శైలిలో రాతపై వేసే ముద్ర. అవే అక్షరాల్ని అందంగా,స్పష్టంగా రాస్తూ కూడా అక్షరాలకు కొంగొత్త ఆకృతులను ఇస్తూ రాయడం ఒక కళ. చేతి రాత వలన కంటికి, చేతికి మధ్య సమన్వయం మెరుగవుతుంది. టైపింగ్ తో పోలిస్తే రాసే సమయంలో మెదడు ఎక్కువ సునిశితంగా పనిచేయాల్సి ఉంటుంది. చక్కని చేతి రాత రాయడం కోసం మనసు యొక్క బద్ధకాన్ని వదిలించుకొని, ఏకాగ్రం చేయాలి. అందుకే చక్కని దస్తూరీని సాధన చేయడం వలన విద్యా నైపుణ్యం కూడా అభివృద్ధి చెందుతుంది.

**ఏకపాత్రాభినయం :** నాటకం వేయడం చాలా ఎక్కువమందితో కూడిన పని. నటన మీద ఇష్టం ఉండి, ఎప్పుడు కావల్సిస్తే అప్పుడు ఎవరిపైనా ఆధారపడకుండా నటించడానికి ఉన్న మంచి అవకాశం ఏకపాత్రాభినయం. పాత్రలో పూర్తిగా లీనమయిపోయి, శరీరాన్ని, స్వరాన్ని, హావ భావాలను పాత్రకనుగుణంగా మలచడం విద్యార్థి తన మనసును పూర్తిగా ఒక పనిపై లగ్నం చేయడం నేర్చుకుంటాడు. ఒక చారిత్రిక పురుషుడిని సజీవంగా కళ్ళ ముందు నిలిపిన భావాన చూసే వారిలో కలుగజేస్తాడు.

**మట్టితో బొమ్మలు చేయడం :** పిల్లల్లోని సృజనాత్మకతని, ఊహాత్మకతని పెంచడమే కాక చిన్నచిన్న వేళ్ళ కదలిక ద్వారా హాండ్ - ఐ కోఆర్డినేషన్, వివిధ మోటార్ ఫంక్షన్స్ వృద్ధిచెంది పెరిగే మెదళ్ళపై పాజిటివ్ ఎఫెక్ట్ ని తీసుకొస్తుంది మరియు ఎక్కువ సమయం ఒకే పనిలో నిమగ్నమై ఉండడం వారిలో ఏకాగ్రతను బలపరుస్తుంది. త్రీ డైమెన్షల్ గా ఒక రూపాన్ని తయారు చేయడం వస్తే, శిల్ప కళ వైపు అడుగువేయడానికి దోహదపడుతుంది. ఇది ఒక రకంగా ఆట ఆధారమైన నేర్చుకోవడం అవడం వల్ల పిల్లలు ఆసక్తితో విషయాలను గ్రహిస్తారు మెత్తని బంక మట్టిని చేతులతో కలపడం పిల్లలను ప్రకృతికి మరింత దగ్గరగా చేస్తుందనడంలో అతిసయోక్తిలేదు మరియు చేతులకు మట్టి అంటినప్పుడు పడే చిరాకు దూరమై ఒక పాజిటివ్ దృక్పధం అలవరచుకోవడానికి దోహదం చేస్తుంది

క్రియా కార్యక్రమాలు మొదలు పెట్టాక చాలా స్కూల్స్ లో పిల్లలు లైబ్రరీని, ల్యాబ్ పరికరాలను ఉపయోగించడం పెరిగింది. పిల్లలు తమ ఊరి యొక్క మ్యాప్ లను స్వయంగా తయారు చేసుకోవడం మొదలు పెట్టారు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిశీలించడం, అవగాహన చేసుకోవడం, మరింతగా పరిశోధన చేయడం, భావాలను చక్కగా వ్యక్తీకరించడం, ఓటమి-గెలుపులను అనుభవించడం, స్వతంత్రంగా ఆలోచించగలగటం వంటి వ్యక్తిగత ప్రయోజనాలు. చుట్టూ ఉన్న వారిని అర్ధం చేసుకోవడం, కలసి పని చేయడం వలన సహానుభూతిని పొంది బాధ్యతాయుతమయిన వ్యక్తులుగా తయారవడం అనే సామాజిక ప్రయోజనాలు పొందుతున్నారు. అన్నిటి కంటే ముఖ్యంగా జీవితాన్ని బాగా ఆస్వాదించేలా చేసి, పుస్తకాలలో గ్రహించిన విషయాలను పదాల దగ్గర ఆగిపోకుండా వాటిని క్రియాత్మకం చేస్తుంది క్రియ.